## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఈఆర్ఓ సేవా ఎస్లావత్

**జూబ్లీహిల్స్, అక్టోబర్ 31 :** అర్హులందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సేవా ఎస్లావత్ పేర్కొన్నారు. మంగళవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఓటు ప్రాధాన్యతపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు.

**వంద శాతం ఓటింగ్ కు కృషి చేయాలి : ఆర్వో రవి**

పోలింగ్ డే సందర్భంగా వందశాతం ఓటింగ్‌కు కృషి చేయాలని.. అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి పేర్కొన్నారు. మంగళవారం ఎన్నికల అధికారులు, స్టిబందితో ఓటు హక్కు ప్రాధాన్యత ప్రచారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈనెల 30 న జరగనున్న ఎన్నికల్లో పూర్తిస్థాయి ఓటింగ్ నమోదు అయ్యేలా అధికారులు తమవంతు కృషిచేయాలన్నారు.

## ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత ఆయుర్వేద శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

ఎర్రగడ్డ, అక్టోబర్ 31: ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద చికిత్సాలయం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఎర్రగడ్డ డివిజన్ కల్యాణ్‌నగర్ వెంచర్–3 కాలనీ వివేకానంద పార్కులో నిర్వహిం చిన ఈ శిబిరంలో సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించు కోగా వారందరికీ మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, కీళ్లనొప్పులు వంటి సమస్యలతో బాధపడుతున్న వాళ్లకు ప్రత్యేక పరీక్షలు జరిపారు. సంఘ సేవకులు, ట్రాన్స్‌కో అధికారి కళ్లెం శ్రీనివాస్‌రెడ్డితో పాటు వెంచర్–3 సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రభాకర్‌రావు, వీరేంద ర్‌రెడ్డి, సుబ్బారావు , తదితరులు ఈ శిబిరం నిర్వహణకు సహకరించారు. శిబిరంలో ఆయుర్వేద దవాఖాన వైద్యులు రాజేశ్వరి, చంద్రశేఖర్, కవితారాథోడ్, మంజుల, గీత, నర్సింహ, పలువురు హౌజ్ సర్జన్లు, సిబ్బంది సేవలను అందించారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ఎర్రగడ్డ, అక్టోబర్ 31: అర్ధరాత్రి గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను బోరబండ పోలీసులు పట్టుకున్నారు. డీఐ భూపాల్ గౌడ్ తెలిపిన ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా విజేత థియేటర్ సమీపంలో ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. అనుమానం వచ్చి వారిని తనిఖీ చేయగా.. గంజాయి లభించింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడినవారిలో బోరబండ హెచ్‌ఎఫ్ నగర్‌కు చెందిన సయ్యద్‌ఫయాజ్ , ఒడిశాకు చెందిన సరోజ్‌కుమార్ దాస్ ఉన్నారు. ఈ ఇద్దరూ ప్రైవేటు ఉద్యోగులే. వారి నుంచి 1700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

## కాలేజీకి వెళ్లిన విద్యార్థిని అదృశ్యం..




జోయ్స్‌మేరీ(ఫైల్)

ఎర్రగడ్డ, అక్టోబర్ 31: కాలేజీకి వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. డీఐ భూపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం., ఎస్పీఆర్ హిల్స్ వినాయక్‌నగర్‌కు చెందిన ఇమాన్యుయేల్ కూతురు జోయ్స్‌మేరీ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నది. రోజు మాదిరిగా మేరీ సోమవారం ఉదయం కాలేజీకని వెళ్లి ..రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాలు, కాలేజీ వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



యూసుఫ్‌గూడ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాంగటి గోపీనాథ్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



ప్రచారంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల కరపత్రాలను ఓటర్లకు అందిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

# మాగంటి ప్రచారానికి బ్రహ్మరథం..

### పేదల కోసమే సంక్షేమ పథకాలు : బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్..యూసుఫ్‌గూడలో ఎన్నికల ప్రచారం..

జూబ్లీహిల్స్, అక్టోబర్31 : జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాంగటి గోపీనాథ్ ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మంగళవారం యూసుఫ్‌గూడ డివిజన్‌లో నిర్వహించిన మలి విడత ప్రచారానికి పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు హాజరై విజయహారతులు పట్టారు. ఇంటింటికీ చేపట్టిన పాదయాత్రలో ప్రజలు పూర్తి మద్దతు తెలుపుతూ ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాకర్షణకు పథకాలను ప్రవేశపెట్టలేదని.. పేద, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు మానవీయకోణంలో సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. ఎన్నికలు ఐదేండ్లకో సారి వస్తే సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో ఎల్లకాలం సంతోషాలను అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ దాస్, నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా యూసుఫ్‌గూడ డివిజన్‌లో కారు గుర్తుకు ఓటువేయాలని కోరుతున్న అభ్యర్థి మాగంటి గోపీనాథ్

## చిల్డ్రన్ హోం బాత్రూమ్ కిటికీ తొలగించి యువతి పరార్

వెంగళరావునగర్, అక్టోబర్ 31: చిల్డ్రన్ హోం బాత్రూమ్ లోని కిటికీని తొలగించి ఓ విద్యార్థిని పరారైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం మేరకు.. వెంగళరావునగర్ డివిజన్..మధురానగర్ లోని స్టేట్ హోం ఆవరణలోని చిల్డ్రన్ హోంలో ఓ యువతి (19) ఆశ్రయం పొందుతుంది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థిని బాత్రూమ్‌లో ఏకాంతంగా ఎక్కువ సమయం గడుపుతుంది. అనుమానించిన హోం నిర్వాహకులు ఆ యువతి బ్యాగ్‌ను తనిఖీ చేశారు. బ్యాగులో సెల్‌ఫోన్ కనిపించింది. ఆమె డైరీ తెరిచి చూసిన అధికారులు కడపకు చెందిన ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదివే విద్యార్థితో చనువుగా ఉంటున్నట్లు తెలుసుకున్నారు. ప్రియుడి గురించి అధికారులు ఆరా తీయడం ఆమెకు నచ్చలేదు. ఆదివారం రాత్రి హోం బెడ్‌పైన నిద్రించిన ఆమె తెల్లారిన తర్వాత చూస్తే కనిపించలేదు. బాత్రూమ్ కిటికీ తొలగించి ఉంది. అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో బాత్రూమ్ కిటికి తొలగించి దూకి పారిపోయినట్లు గ్రహించిన సిబ్బంది ముంతాజ్ బేగం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డంపింగ్ యార్డులో ఆటోను ఢీకొన్న లారీ

వెంగళరావునగర్, అక్టోబర్ 31:చెత్త డంపింగ్ యార్డులో అతి వేగంతో దూసుకొచ్చి లారీ.. ఆటోను ఢీకొనడంతో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..యూసుఫ్‌గూడ జవహర్ నగర్ కు చెందిన రంగన్న సోమవారం ఉదయం తన భార్య లక్ష్మితో కలిసి సేకరించిన చెత్తను డంప్ చేయడానికి ఆటోతో కృష్ణకాంత్ పార్క్ సమీపంలోని యార్డుకు చేరుకున్నాడు. డంపింగ్ చేస్తున్న క్రమంలో టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి వీరి చెత్త ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## చురుకుగా ర్యాంప్‌ల నిర్మాణం..



జూబ్లీహిల్స్, అక్టోబర్ 31: దివ్యాంగుల సౌకర్యార్థం పోలింగ్ స్టేషన్‌లలో ర్యాంప్‌ల నిర్మాణం చురుకుగా చేపడుతు న్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయా పోలింగ్ బూత్‌లకు వృద్ధులను, ది వ్యాంగులను చక్రాల కుర్చీపై సునాయాసంగా తరలించేందుకు ర్యాంప్‌ల నిర్మాణం చేపడు తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 329 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా వీల్‌చైర్‌ల ప్రవేశానికి అనుకూలంగా లేని పోలింగ్ బూత్‌లలో వీటి నిర్మాణం చేపడు తున్నారు. మంగళవారం ఈఈ రాజ్‌కుమార్ ఆదేశాలతో ఏఈ అవినాష్ పోలింగ్ బూత్‌లలో ర్యాంప్‌ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

## మాగంటిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం..

### బోరబండలో గులాబీ శ్రేణుల ప్రచారం

ఎర్రగడ్డ, అక్టోబర్ 31: జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తరపున బోరబండలో గులాబీ శ్రేణులు విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. డివిజన్ నలు మూలలా ఎక్కడికక్కడ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గడప గడపకు వెళ్లి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం వినాయకరావునగర్‌లో పార్టీ నేత జి.లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. నియోజకవర్గాన్ని అన్ని విధాలా ముందుకు తీసుకెళ్తున్న గోపీనాథ్ ఘన విజయానికి సహకారం అందించాలని స్థానికులను కోరారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అయితే దేశంలో నంబర్ వన్ స్థానంలో తెలంగాణ నిలుస్తుందని పేర్కొన్నారు. గత పాలకుల హయాంలో మురికివాడలను ఓటు బ్యాంకుగా మలచుకుని కనీస వసతుల కల్పనను పూర్తిగా విస్మరించారని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తయిన వాస్తవాన్ని గ్రహించాలని సూచించారు. పార్టీ నేతలు రవీందర్, రమేశ్‌యాదవ్, అనిల్, మహేందర్‌గౌడ్, ఆనంద్, వంశీ, వెంకటేశ్, రాజేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



వినాయకరావునగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నేత లక్ష్మణ్‌గౌడ్, తదితరులు